
నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, ఆదివారం 15 జూన్ 2025 | KAMAREDDY

ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా అప్పుడే వానకాలం పంటల సాగు ప్రారంభమైంది. వానాకాలం ముందుగానే రావడం.. వర్షాలు సరిపడా కురుస్తుండడంతో అన్నదాతలు సాగు పనులు మొదలుపెట్టారు. సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా అందుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతున్నది. సర్కారు రోజుకో ప్రకటన చేస్తుండడంతో రైతు భరోసా ఎప్పుడు వస్తుందోనని అన్నదాత ఆశగా ఎదురు చూస్తున్నాడు. చేసేదేమీ లేక అప్పు కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్నాడు.

–నిజామాబాద్, జూన్ 14, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



# రైతుకేది భరోసా?

- రైతు భరోసా పథకం అమలుపై అన్నదాతల్లో అనుమానాలు
- వానాకాలం పంటల సాగులో ఉమ్మడి జిల్లా రైతన్న బిజీబిజీ
- పెట్టుబడి సాయం అందజేతపై ప్రభుత్వం రోజుకో ప్రకటన
- యాసంగి సీజన్‌లో సగం మందికే అందిన రైతు భరోసా
- అప్పుల కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్న కర్షకులు

రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్‌పై రైతులు కన్నెర్ర చేస్తున్నారు. పెట్టుబడి సాయం సమయానికి ఇవ్వకుండా తాత్సారం చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం కాంగ్రెస్ పార్టీ రైతుబంధు స్థానంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ.5వేలు పెట్టుబడి సాయం అమలైంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.7,500 చొప్పున రైతుల బ్యాంక్ అకౌంట్లో జమ చేయాలి. ఇచ్చిన హామీలకు పంగనామాలు పెట్టిన రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. ఎకరాకు రూ.6వేలు మాత్రమే పెట్టుబడి సాయం చేస్తామని యాసంగి సీజన్ ముందు చెప్పింది. ఎంతో కొంత సాయం అందుతుందని రైతులంతా సంబుర పడ్డారు. తీరా సీజన్ ముగిసినా.. యాసంగి సీజన్‌లో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం ఇంకా అందలేదు. పంట అమ్ముకున్న రైతులు ఇప్పుడు వానాకాలం సీజన్‌కు సన్నద్ధం అవుతున్నారు. ఎకరాకు రూ.6వేలు త్వరగా ఇస్తే సాగు ఖర్చులకు ఉపయుక్తం అవుతుందని రైతులు భావిస్తున్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు నోటికొచ్చినట్లుగా ప్రకటనలు చేస్తుండగా.. అవి అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి సుమారుగా రూ.250 కోట్లు మేర పెట్టుబడి సాయం పెండింగ్‌లో ఉన్నది.

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12లక్షల ఎకరాల్లో పంటల సాగు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కలిపి సుమారుగా 12లక్షల ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు సిద్ధం చేసింది. ఇందులో అత్యధికంగా వరి సాగునే రైతులు ఎంచుకున్నారు. ఇతర పంటలను కొద్ది మంది మాత్రమే సాగుచేయనున్నారు. జూన్ మాసం ప్రారంభానికి ముందే వానాకాలం పలకరించింది. వానలు కూడా కురుస్తున్నాయి. భూమి దుక్కిదున్నేందుకు సరిపడా వర్షం కురియడంతో చాలా మంది ముందస్తుగానే పంట కాలాన్ని మొదలు పెట్టారు. జూన్ నెలాఖరులోగా అత్యధిక శాతం నాట్లు కూడా పూర్తయ్యే అవకాశం ఉన్నది. ఇప్పటికే బాన్సువాడ, బోధన్, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున వరి నాట్లు షురూ చేశారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే 50శాతం మేర నాట్లు పూర్తయినట్లుగా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన ప్రదేశాల్లో పుటం మడులు పోసుకుంటున్నారు. ఈ పరిస్థితిలో పెట్టుబడి సాయం చేతికి అందితే మేలు ఉంటుందని రైతులు భావించారు. కానీ అదేదీ అమలు కాలేదు. యాసంగి సీజన్‌కే పైసలు పత్తా లేకపోవడంతో రేవంత్ రెడ్డి సర్కారుపై నమ్మకం లేక కర్షకులంతా అప్పుల వేటలో మునిగిపోయారు. చేబదులు తెచ్చుకుని విత్తన సంచులు తెచ్చుకుంటున్నారు. కూలీ నాలీ వ్యయాలకు బకాయి పెడుతున్నారు. జూన్ మాసం మొదలై రెండు వారాలు దాటుతున్నప్పటికీ రైతు భరోసా అమలుపై కాంగ్రెస్ సర్కారు శ్రద్ధ పెట్టకపోవడంపై రైతులు తీవ్ర స్థాయిలో దుమ్మెత్తి పోస్తున్నారు.

### రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు..

కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి జిల్లా రైతులు తీవ్రంగా మోసపోతున్నారు. కేసీఆర్ పాలనలో రైతుబంధు సొమ్మును ఠంచనుగా దక్కించుకున్నారు. సమయానికి అనుగుణంగా పెట్టుబడి సాయం అందేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 2023 యాసంగి, 2024 వానాకాలం, యాసంగి మూడు సీజన్లు ముగిశాయి. తాజాగా 2025 వానాకాలం సీజన్ ప్రారంభమైంది. ఇందులో కేవలం 2024–25 యాసంగి సీజన్‌లోనే రైతుభరోసా పథకం అధికారికంగా పంట కాలం ముగుస్తున్నప్పటికీ ఇస్తామని చెప్పిన రైతుభరోసా అమలు చేయకపోవడంపై సర్వత్రా రైతుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. కామారెడ్డి జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం యాసంగి సీజన్‌కు సంబంధించి 3,02,065 మంది రైతులు ఉన్నారు. ఎకరాకు రూ.6వేలు చొప్పున లెక్కిస్తే రూ.296.77కోట్లు రైతుభరోసా రావాల్సి ఉన్నది. ప్రభుత్వం అమలు చేసిన పథకంతో కేవలం సగం మందికే మేలు చేకూరింది. ఇంకా రూ.వంద కోట్ల వరకు యాసంగి సీజన్‌లో రైతులకు సర్కారు బకాయి పడింది. నిజామాబాద్ జిల్లాలో 2లక్షల 82వేల మందికి రైతు భరోసా రూపంలో సుమారుగా రూ.300కోట్లు జమ చేయాల్సి ఉన్నది. అరకొరగా పెట్టుబడి సాయం అందినట్లు తెలిసింది. కాగా.. వివరాల వెల్లడికి వ్యవసాయ శాఖ అధికారులు వెనుకాడుతున్నారు.



# రాహుల్‌గాంధీ దర్శనం కోసం విలవిల్లాడుతున్న సీఎం

- సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు నడుం బిగించాలి
- జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఖలీల్‌వాడి, జూన్ 14: రాహుల్‌గాంధీ దర్శనం కోసం సీఎం రేవంత్‌రెడ్డి విలవిల్లాడుతున్నారని, ఢిల్లీకి వెళ్లడంలో ఆయన హాఫ్ సెంచరీ పూర్తిచేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు సాయినాథ్‌తోపాటు పలు విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో జాగృతిలో చేరారు. వారికి ఆమె కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. తెలంగాణ జాగృతి విద్యార్థి సమాఖ్య నాయకులు వర్షిత్ పెద్దరాజుల, సందీప్ దాసోజు, రాధశ్రీ, వైష్ణవి, శంకర్‌గౌడ్ నాయకత్వంలో చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు నడుం బిగించాలని పిలుపునిచ్చా రు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో ఊరుకోబోమని స్పష్టంచేశారు. దాదాపు రూ. 8 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టాలని సూచించారు.

# రాజీ పద్ధతిలో కేసుల పరిష్కారం శ్రేయస్కరం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మి

వినాయక్‌నగర్, జూన్ 14: కోర్టులో కేసుల పరిష్కారానికి సమయం పడుతుందని, కక్షిదారులు రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవడం శ్రేయస్కరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎన్ భరతలక్ష్మి అన్నారు. నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ, హరీష, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి, బార్ అధ్యక్షుడు సాయారెడ్డి, న్యాయసేవ సంస్థ కార్యదర్శి ఉదయ్ భాస్కర్ రావు, అదనపు డీసీపీ బస్వారెడ్డితో కలిసి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. న్యాయవివాదాలు కొనసాగించుకోవడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని, జీవిత కాలాన్ని పోగొట్టుకుంటారని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇష్టపూర్వకంగా కేసులను రాజీ చేసుకోవడానికి సంస్థ సిద్ధమని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హాజరుకాకపోవడం నిబంధనలు అతిక్రమించడమే అన్నారు. అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ మాట్లాడుతూ.. హత్య కేసుల్లో కన్నవారిని పోగొట్టుకున్న పిల్లల జీవన, విద్య, ఆర్థిక భవిష్యత్తుకు చట్టం రక్షణగా నిలుస్తుందని చెప్పారు. అదనపు జిల్లా జడ్జి హరీష, ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జి సాయిసుధ, జూనియర్ సివిల్ జడ్జిలు గోపీకృష్ణ, ఖుష్బూ ఉపాధ్యాయ్ ,శ్రీనివాస్ రావు, హరికుమార్ పాల్గొన్నారు.

### రూ.90 లక్షల విలువైన చెక్ అందజేత..

జిల్లా కోర్టులో విచారణ దశలో ఉన్న రోడ్డు ప్రమాద నష్ట పరిహార దావాను చోళ మండల జనరల్ బీమా కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్ నేమురి సదానంద్ గౌడ్, మృతుడు బాదావత్ ప్రేమదాస్ భార్య, పిల్లలు, తల్లిని రాజీ పద్ధతిలో ఒప్పించారు. రూ.కోటీ ఇరవై ఐదు లక్షల దావాను రూ.90 లక్షలతో అవార్డును జిల్లా జడ్జి బాధిత కుటుంబానికి అందజేశారు.

## కామారెడ్డి జిల్లాలో 1,840 కేసుల పరిష్కారం

కామారెడ్డి,జూన్ 14: కామారెడ్డి జిల్లాలో మొత్తం ఎనిమిది బెంచీలు ఏర్పాటు చేసి 1840 కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించారు. జిల్లా కేంద్రంలోని కోర్టు భవనంలో నిర్వహించిన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. చీటింగ్, సైబర్, బ్యాంకు ప్రీ లిటిగేషన్, చెక్ బౌన్స్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.1.40 కోట్ల విలువైన ఒక మోటరు యాక్సిడెంట్ కేసును పరిష్కరించినట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగి తల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి బీమా ప్రతినిధులు రూ.1.40 కోట్ల విలువైన చెక్కును అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జి సుమలత, జూనియర్ న్యాయ అధికారులు సుధాకర్, దీక్ష, ఏసీపీ నర్సింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజాగోపాల్‌గౌడ్, ఏపీపీ దామోదర్ రెడ్డి, సూర్యప్రకాశ్, జిల్లా కోర్టు సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర గవర్నర్ నుంచి ఐఎస్‌వో పత్రం అందుకుంటున్న రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఆంజనేయులు, తదితరులు



# బెస్ట్ బ్లడ్ డోనర్స్

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, జూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అవార్డులు అందజేశారు. రాష్ట్రంలో ఎక్కువ రక్తదాన శిబిరాలను నిర్వహించినందుకు గాను కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్.. గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్తం సేకరించి, అత్యవసర పరిస్థితుల్లో అందజేసినందుకు గాను అవార్డు వచ్చిందని తెలిపారు. కలెక్టర్‌కు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ తలసేమియా అవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నది. దీంతో వరుసగా మూడోసారి ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకున్నది. నిజామాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు గాదేవార్ గంగాధర్ అత్యధికంగా 67 సార్లు రక్తదానం చేయడంతో అతడిని గవర్నర్ అభినందించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, భవానీ శంకర్, ఆంజనేయులు, రాజశేఖర్, రవీందర్, గంగాధర్ పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి అవార్డు అందుకుంటున్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



# తాగునీటి కోసం రాస్తారోకో

## రోడ్డుపై బైఠాయించిన మహిళలు

నిజాంసాగర్, జూన్ 14: కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని బుడగజంగాల కాలనీలో వారం రోజులుగా నీటి ఎద్దడి నెలకొన్నది. అధికారులకు పలుమార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదు. దీంతో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ కాలనీ మహిళలు మండలకేంద్రంలోని బోధన్ – హైదరాబాద్ ప్రధాన రహదారిపై శనివారం బైఠాయించి నిరసన తెలిపారు. రాస్తారోకో చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై శివకుమార్ ఘటనా స్థలానికి సిబ్బందిని పంపించారు. పోలీసులు మహిళలను సముదాయించారు. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందితో మాట్లాడి.. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపుతున్న మహిళలు

# రూ.40.50 లక్షలతో ఉడాయించిన ప్రైవేటు ఉద్యోగి

వినాయక్‌నగర్, జూన్ 14 : జిల్లా కేంద్రంలోలోని ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి, సంస్థ కార్యాలయంలో ఉన్న డబ్బులతో ఉడాయించిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. సుమారు రెండు కోట్ల రూపాయల నగదులో నుంచి రూ.40.50 లక్షల నగదు తీసుకుని పరారయ్యాడని సంస్థ బాధ్యులు నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో మనీ మేనేజ్‌మెంట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ సంస్థ కార్యాలయం ఉన్నది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం నుంచి 2 కోట్ల రూపాయల నగదు ఎల్లమ్మగుట్టలోని కార్యాలయానికి వచ్చింది. మొత్తం నగదులో నుంచి కోటీ 60 లక్షల నగదును వివిధ ప్రాంతాల్లోని ఏటీఎం సెంటర్లకు డిస్ట్రిబ్యూట్ చేశారు. కార్యాలయంలో నుంచి రూ.40.50 లక్షలు రమాకాంత్ అనే ఉద్యోగి తీసుకుని పరారైనట్లు గుర్తించిన సంస్థ మేనేజర్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# రైతు రిజిస్ట్రీకి ఓటీపీ తిప్పలు

- నిజామాబాద్ జిల్లాలో 34శాతం రైతుల నమోదు మాత్రమే పూర్తి
- గడువు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం

దేశ ప్రజలకు ఆధార్ కార్డు అందజేసిన మాదిరిగానే అన్నదాతకు కూడా 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులను అందజేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రైతు నమోదు ప్రక్రియను మే నెలలో ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో రైతు రిజిస్ట్రేషన్ చేసుకుంటుండగా.. ఓటీపీ సమస్యలు రావడంతో నమోదు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

–ఖలీల్‌వాడి, జూన్ 14




ఫార్మర్ రిజిస్ట్రేషన్ కాకపోవడంతో అన్నదాతల ఇబ్బందులు

నిజామాబాద్ జిల్లాలో రైతు రిజిస్ట్రీ నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. అన్నదాతల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ యోజనతో పాటు పలు పథకాలను అమలు చేస్తున్నది. ఈ పథకాలు నేరుగా రైతులకు అందేలా 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులను అందజేయాలని కేంద్రం నిర్ణయించింది. రైతు పేరు ఆన్‌లైన్‌లో నమోదు కావడానికి అతడి సంబంధిత మొబైల్ నంబర్‌కు రెండు ఓటీపీలు రావాలి. మొదటి ఓటీపీ వచ్చినా.. రెండోది రావడం లేదు. దీంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతులకు పేరు నమోదుపై సరైన అవగాహన కల్పించకపోవడంతోనే సమస్య తలెత్తుతున్నదని తెలుస్తున్నది. భూ యాజమాన్య హక్కు పాస్ పుస్తకం, ఆధార్‌కు లింకు చేసిన మొబైల్ నంబర్‌తో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజనతోపాటు ఇతర అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందేందుకు ఈ ఫార్మర్ రిజిస్ట్రీ చేయడం తప్పనిసరి. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది.

### రైతులు ముందుకు రావాలి..

విశిష్ట గుర్తింపు కార్డు నమోదు కారక్రమాన్ని పూర్తి చేయడానికి రైతులు ముందుకు రావాలి. నమోదు చేసేందుకు రైతు వేదికల్లో ఏఈవోలు అందుబాటులో ఉంటున్నారు. సాంకేతిక సమస్య కారణంగా కొంత ఆలస్యం అవుతున్నది. నమోదుకు మరికొన్ని రోజులు గడువు ఉన్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలి. లక్ష్యం చేరుకునేందుకు అధికారులతో కలిసి చర్చించడం జరిగింది.

–వీరస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

### సాంకేతిక సమస్యలు..

మే నెలలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను ప్రారంభించినా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని ప్రదేశాల్లో ఓటీపీ రాకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో అసలు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో నమోదు ప్రక్రియ ఆలస్యం అవుతున్నది. జూన్ 4వతేదీ వరకు రైతులందరి నమోదును పూర్తి చేయాలని గడువు విధించారు. కానీ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దానిని మరికొన్ని రోజులు పొడిగించారు. నిజామాబాద్ జిల్లాలో ఇంతవరకు 34 శాతం మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకున్నారు. జిల్లాలో 2.92లక్షల మంది పట్టాదారులు ఉండగా ఇప్పటివరకు 95,762 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. సగం మంది రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం గమనార్హం. అధికారులు మాత్రం రైతులు ముందుకు వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలని సూచిస్తున్నారు.

# నాడు నేల రాలగా.. నేడు నారు మడిలా..!

ఈ ఫొటోలో కనిపిస్తున్నది నారుమడి అనుకుంటున్నారు కదూ..! అయితే మీరు పొరపాటు పడ్డట్లే.. ఎందుకంటే..? కోటగిరి శివారులో యాసంగిలో సాగుచేసిన వరి పంటను ఒక రైతు హార్వెస్టర్ ద్వారా నూర్పిడి చేయించాడు. అప్పుడు నేల రాలిన గింజలు.. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ఇలా నారు మడిని తలపించేలా మొలకెత్తాయి. ప్రస్తుతం ఆ మడి పచ్చగా కనిపిస్తుండడంతో అటువైపుగా వెళ్తున్న ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

–కోటగిరి, జూన్ 14

